క్లుప్తంగా

ఎమ్మెల్సీ తోటను కలిసిన సేవాదళ్ రీజినల్ కోఆర్డినేటర్


ఎమ్మెల్సీ తోటను కలిసిన వెంకటరాయుడు తదితరులు

మండపేట: వైఎస్సార్ సీపీ సేవాదళ్ రీజినల్ కోఆర్డినేటర్ వెంకటరాయుడు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. మండల కమిటీల ఏర్పాటుపై ఎమ్మెల్సీ తోట పలు సూచనలు చేశారు. ప్రత్యేక కార్యాచరణతో నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి సేవాదళ్ కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు. వెంకటరాయుడు మాట్లాడుతూ సేవాదళ్ మండపేట అర్బన్ కన్వీనర్‌గా ముక్కా సుబ్రహ్మణ్యం, రూరల్ కన్వీనర్‌గా మాజీ ఎంపీటీసీ సభ్యుడు పోతుల రాంబాబు, రాయవరం మండల కన్వీనర్‌గా వెలగల సత్యనారాయణరెడ్డి, కపిలేశ్వరపురం మండల కన్వీనర్‌గా పాలంగి కృష్ణ కిషోర్‌లను నియమించినట్టు తెలిపారు. యువనేత తోట పృథ్వీరాజ్, సేవాదళ్ జిల్లా కన్వీనర్ మంగ కంపల్లి అంజిబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటింటా సర్వే


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీఓ సింధూ సుబ్రహ్మణ్యం

రామచంద్రపురం: ఓటర్ల జాబితాపై శుక్రవారం నుంచి ఇంటింటా సర్వే చేపడుతున్నామని, దీనికి అన్ని రాజకీయ పార్టీలూ సహకరించాలని రామచంద్రపురం ఆర్‌డీఓ పి.సింధూ సుబ్రహ్మణ్యం సూచించారు. నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం తన కార్యాలయంలో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పోలింగ్ బూత్ అధికారులు ఈ సర్వే చేస్తారన్నారన్నారు. ఏమైనా ఓట్లు తొలగించవలసినా, కొత్తగా నమోదు చేయాల్సి ఉన్నా, ఉన్న ఓటర్లకు సంబంధించి ఏమైనా మార్పులున్నా పరిశీలించుకోవాలని సూచించారు. ఈ మేరకు ఆయా పార్టీల ప్రతినిధుల సూచనలు, సలహాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, నియోజకవర్గంలోని మూడు మండలాల తహసీల్దార్లు కూడా పాల్గొన్నారు.

పైపులైన్లకు మరమ్మతులు


పైపులైన్లకు మరమ్మతులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి ఇంపాక్ట్

కాజులూరు: శలపాక శివారు మొగలిపాలెంలో పంచాయతీ సిబ్బంది లీకవుతున్న పైపులైన్లకు మరమ్మతులు చేపట్టి, కుళాయిలకు తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. గ్రామంలో కుళాయి పైపులైనుకు రంధ్రాలు ఏర్పడి తాగునీరు వృథాగా పంట కాలువలోకి పోతోంది. దీంతో పబ్లిక్ కుళాయిలకు నీరు రావడం లేదంటూ గ్రామ వలంటీర్ ద్వారా సచివాలయ సిబ్బందికి స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేశారు. అయినప్పటికీ అధికారులు స్పందించలేదు. దీనిపై 'వృథాగా పోతున్న తాగునీరు' శీర్షికన 'సాక్షి' గురువారం కథనం ప్రచురించింది. వెంటనే స్పందించిన ఈఓ పీఆర్‌డీ సీహెచ్ ఇందిరాదేవి ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. గ్రామ సచివాలయ సిబ్బంది వెళ్లి, పైపులైన్‌కు మరమ్మతులు చేశారు. కుళాయిలకు తాగునీటి సరఫరాను పునరుద్ధరించటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

కార్మికుల ధర్నా

మండపేట: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ధర్నా చేస్తున్నట్టు జిల్లా కార్యదర్శి నూకల బలరాం తెలిపారు. సంఘనాయకులు బంగారు కొండ, కె.నరేంద్ర, లోవరాజు, విజయ్, రాజు, భాను, హేమలత పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

కాజులూరు: గొల్లపాలెం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ఈపీడీసీఎల్ కాకినాడ డీఈ జి.ప్రసాద్ తెలిపారు. గొల్లపాలెం మెయిన్ సబ్ స్టేషన్ ఏఈ ఎం.సూర్యనారాయణ ఆధ్వర్యాన గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సబ్ స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల్లో భాగంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. అంద్రంగి ఫీడర్ పరిధిలోని కరప మండలం పెద్దాపురప్పాడు, యండమూరు, విజయరాయుడుపాలెం, కాజులూరు మండలంలోని పెనుమళ్ళ, తనుమళ్ళ, అంద్రంగి, పెదపాటిగరువు గ్రామాలకు.. అలాగే, కుయ్యేరు సబ్ స్టేషన్ పరిధిలోని కుయ్యేరు, మేకలగరువు, రేగుబాడవ, దుగ్గుదుర్రు, చింతల్లంక గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వివరించారు.

క్షణ క్షణం భయం భయం

- ముంచుకొచ్చిన వరద ముప్పు
- భయాందోళనల్లో లంక గ్రామాల ప్రజలు
- ముందస్తు చర్యల్లో ప్రభుత్వ అధికారులు


2020 ఆగస్టులో అద్దంకివారిలంకలో పంటుపై పశువులను గ్రామాలకు తరలిస్తున్న దృశ్యం (ఫైల్)


ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నీరు

కపిలేశ్వరపురం: గోదావరి నిండుకుండను తలపిస్తోంది. సుదూర ప్రయాణంలో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దానికి తోడు స్థానికంగానూ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు ప్రతి క్షణం భయాందోళనకు గురవుతున్నారు. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని పలు లంక గ్రామాలు పూర్తిగా గోదావరి నదిలో ఉన్నాయి. ప్రస్తుతానికి పరిస్థితి ప్రశాంతంగానే ఉన్నా గోదావరిలో నీటి మట్టం మరింత పెరిగితే లంక గ్రామాలు ముంపు బారిన పడే ప్రమాదం పొంచి ఉంది. రోజురోజుకూ వరద తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో లంక గ్రామాల పరిస్థితులపై ఈ కథనం...

ప్రమాదంలో ఉన్న లంక గ్రామాలు

కపిలేశ్వరపురం మండలంలో అద్దంకివారిలంక, కేదారిలంక, కె.గంగవరం మండలంలో శేరిలంక మొత్తం మూడు గ్రామాలు వరద ప్రభావానికి గురవుతాయి. అద్దంకివారిలంక గ్రామ పరిధిలో పల్లపులంక, అద్దంకివారిలంక, కోరుమిల్లి లంక, కేదారిలంక గ్రామ శివారులో వీధివారిలంక, కేదారిలంక, కపిలేశ్వరపురం గ్రామ పరిధిలో నారాయణలంకలు తరచూ ముంపుబారిన పడతాయి. ధవళేశ్వరంలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ కాగానే ఆయా గ్రామాల పరిధిలోని వ్యవసాయ క్షేత్రాలకు వరద నీరు తాకుతుంది. రెండో ప్రమాద హెచ్చరిక రాగానే వ్యవసాయ క్షేత్రాలు మొత్తం ముంపుబారిన పడతాయి. పశువులను గ్రామాలకు తరలించుకుంటారు. మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేసిన పరిస్థితుల్లో గ్రామాల్లోని నివాసిత ప్రాంతమంతా వరదనీటిలో తేలుతుంటాయి.

గత అనుభవాలు..

2014, 2016, 2018, 2019, 2020లలో వరుసగా వరదలకు లంక గ్రామాలు ముంపుబారిన పడ్డాయి. 2018 ఆగస్టు వరదలకు కపిలేశ్వరపురం, నారాయణలంక, కేదారిలంక, వీధివారిలంక గ్రామాల పరిధిలో 126.93 హెక్టార్లు, తాతపూడిలో 27.94 హెక్టార్లు, కోరుమిల్లి, అద్దంకివారిలంక, పల్లపులంక గ్రామాల పరిధిలో 54.72 హెక్టార్లు, మండలం మొత్తంలో 646 మంది రైతులకు చెందిన 209.59 హెక్టార్లలోని అరటి, బొప్పాయి, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రూ.36,53,650 నష్టం వాటిల్లింది. 2019 ఆగస్టులో లంకల్లోని వ్యవసాయ క్షేత్రాలు, ఇటుక బట్టీలన్నీ ముంపుబారిన పడ్డాయి.

ప్రస్తుత వరద పరిస్థితి ఇలా...

గోదావరి ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు గోదావరి నీటిమట్టం పెరుగుతూ ఉంది. మరింత పెరిగితే లంక గ్రామాల వ్యవసాయ క్షేత్రాల సమీపానికి నీరు చేరుకుంది. ధవళేశ్వరం బ్యారేజి వద్ద 43 అడుగుల నీటిమట్టం నమోదయితే మొదటి ప్రమాద హెచ్చరికను, 48 అడుగులకు చేరుకుంటే రెండో ప్రమాద హెచ్చరికనూ, 53 అడుగులకు నమోదయితే మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేస్తారు.

తొగరపాట వంతెన మునగడంతో ఇతర గ్రామాలతో రాకపోకలు తెగిపోయాయి. వీరవల్లి పాలెం రహదారి మునిగిపోవడంతో ఆర్టీసీ, ప్రైవేటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరికి ఎడమ భాగాన ఉన్న తాతపూడి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, శ్రీరాంపురం, వాకతిప్ప గ్రామాల పరిధిలోని ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి.

వరదలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధం

వరద తీవ్రత పెరిగితే ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. ఇప్పటికే అధికారులను అప్రమత్తం చేసింది. కంట్రోల్ రూంలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తోంది. గ్రామాలకు నీరు చేరుకుంటే కొత్తపేట, అయినవిల్లిలలోని ప్రభుత్వ పాఠశాలలను పునరావాస కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. వరద ప్రభావం తొలుత అద్దంకివారిలంక శివారు పల్లపులంకను తాకుతుంది. తర్వాత పల్లపులంక గ్రామంలోకి ఆ తర్వాత అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాలు ముంపుబారిన పడతాయి.

చర్యలు తీసుకుంటున్నాం



తగిన చర్యలు తీసుకుంటున్నాం. అధికారులంతా అందుబాటులో ఉన్నారు. పంచాయతీ, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తున్నాం.

– వీధి వెంకటరెడ్డి, సర్పంచ్, కేదారిలంక, కపిలేశ్వరపురం

టాం టాం వేయించాం



వరదలు నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని లంక గ్రామాల్లో టాం టాం వేయించాం. నీటిమట్టం మరింత పెరిగితే పశువులను సురక్షిత ప్రాంతాల్లోకి తరలించుకోవాలని సూచించాం. పారిశుద్ధ్య చర్యలను చేపడుతున్నాం.

– కొమరం సూర్యారావు, తహసీల్దార్, కపిలేశ్వరపురం

ఆగిన కోటిపల్లి పంటు ప్రయాణం


కోటిపల్లి వద్ద గోదావరిలో నిలిచిన పంట్లు, పడవలు

కె.గంగవరం: గోదావరి వరద ఉధృతితో కోటిపల్లి – ముక్తేశ్వరం మధ్య పంటు, పడవ ప్రయాణాలు నిలిచిపోయాయి. లంకల నుంచి పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వరద మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

అప్రమత్తమైన అధికారులు


అద్దంకివారిలంకలో వరద పరిస్థితిపై స్థానికులతో చర్చిస్తున్న తహసీల్దార్ సూర్యారావు

కపిలేశ్వరపురం: ధవళేశ్వరంలో ఒకటో ప్రమాద హెచ్చరికను నేపథ్యంలో కపిలేశ్వరపురం మండలంలోని రెవెన్యూ, పంచాయతీ, వ్యవసాయ, ఉద్యానశాఖ, పాడిపరిశ్రమాభివృద్ధి శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. తహసీల్దార్ కొమరం సూర్యారావు మండలంలోని కేదారిలంక, వీధివారిలంక, నారాయణలంక, అద్దంకివారిలంక, పల్లపులంక గ్రామాల్లో పర్యటించారు. గోదావరి నీరు తాకిన వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. గ్రామాధికారులకు ప్రత్యేక బాధ్యతలను అప్పగించారు. వరద ప్రభావం తగ్గే వరకూ లంక గ్రామాల అధికారులు, ఉద్యోగులు చొరవతో పని చేయాలని ఆదేశించారు.

ముంపుబారిన వరినాట్లు

కపిలేశ్వరపురం: వరద నేపథ్యంలో పంట కాలువల్లోకి నీటిని వదలడంతో పంట పొలాలు ముంపుబారిన పడుతున్నాయి. వరినాట్లు నీట మునిగాయి. కోరంగి కెనాల్‌లో నీటి ఉధృతికి వెదురుమూడి వంతెన సమీపంలోని కాటాలదిబ్బ ఏరియాలోని సుమారు 50 ఎకరాలు వరినాట్లు ముంపు బారిన పడ్డాయి. సుమారు 15 రోజులు క్రితం వెదజల్లామని, ఇంతలోనే కాలువ నుంచి నీటి ప్రవాహం పెరగడంతో చేలు మునిగిపోయాయంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలువలో నీటి మట్టాన్ని తగ్గించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పంట నమోదు పక్కాగా చేపట్టాలి

రాయవరం: పంట నమోదు నిర్ణీత సమయంలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో గురువారం మండలంలోని గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లకు ఖరీఫ్‌కు సంబంధించి పంట నమోదుపై అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో వ్యవసాయాధికారి ప్రభాకర్ మాట్లాడుతూ పంట నమోదు డేటా ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వచ్చే అన్ని పథకాలకు ఉపయోగిస్తుందన్నారు. అందుకే డేటా నమోదులో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. తొలకరి పంట నమోదుకు అనుసరించాల్సిన విధి విధానాలను వివరించారు. డిప్యూటీ తహసీల్దారు విజయరేఖ మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ అధికారులు మీ గ్రామంలో ఉండే సర్వే నంబర్లతో కూడిన పూర్తి వివరాలను గ్రామ వ్యవసాయ సహాయకులకు ఇవ్వాలన్నారు. అందులో నాన్ అగ్రికల్చర్ ల్యాండ్, కన్వర్షన్ ఏమైనా ఉన్నట్‌లైతే ఆ వివరాలను వ్యవసాయ శాఖకు తెలియపర్చాలని వీఆర్వోలను ఆదేశించారు.

వలంటీర్ ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఆదివారపుపేట, నెలపర్తిపాడు గ్రామ సచివాలయాల పరిధిలో ఒక్కొక్కటి, తాడిపల్లి గ్రామ సచివాలయం పరిధిలో రెండు వలంటీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల అయినట్లు ఎంపీడీఓ ఎస్.షెలత్‌రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే గ్రా మంలో నివాసం ఉంటూ 10వ తరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మంత్రి వేణు పరామర్శ

రామచంద్రపురం: పట్టణంలోని కొత్తూరుకు చెందిన వైఎస్సార్ సీపీ వార్డు కన్వీనర్ గుణ్ణం రామకృష్ణ తల్లి వీరాయమ్మ (72) ఇటీవల వృద్ధాప్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో రామకృష్ణ, సత్తిబాబు సోదరులను రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ గురువారం పరామర్శించారు.

గంటల వ్యవధిలో రేషన్ కార్డు

వలంటీర్లకు వందనం


వల్లూరులో గంట వ్యవధిలోనే మంజూరైన రైస్ కార్డును లబ్ధిదారుకి అందజేస్తున్న అధికారులు (ఫైల్)

కపిలేశ్వరపురం: గత ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డు, పింఛను, ఆరోగ్యశ్రీ తదితర పథకాల కార్డులను మంజూరు చేయాలంటే అప్పటి అధికార పార్టీ నేతలు, జిరాక్స్ షాపులు, కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. వాటి కోసం పనులు మానుకొని రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. వలంటీర్ ఎంవీవీ లక్ష్మి వల్లూరు సచివాలయంలో 2020 సెప్టెంబర్ 19న గ్రామానికి చెందిన వెలంపాలెపు కమలావతి దరఖాస్తు చేసుకున్న గంట వ్యవధిలోనే రైస్ కార్డును అందజేశారు. మండపేట పట్టణంలోని 25వ వార్డుకు చెందిన వెలగల మంజు 2020 సెప్టెంబర్ 16న 12వ సచివాలయంలో రైస్ కార్డు మంజూరు కోసం దరఖాస్తు చేయగా రెండు గంటలు వ్యవధిలోనే కార్డు ను మంజూరు చేసి అందజేశారు. రాయవరం–01 సచివాలయం పరిధిలో వెలుగుబంట్ల సత్యవేణి 2020 సెప్టెంబర్ 18న దరఖాస్తు చేసిన రెండు గంటల్లోనే రైస్ కార్డును అందజేశారు. ఇలా వారు చేసిన సేవలతో ఎన్నో కుటుంబాలకు న్యాయం జరిగింది.

జనహితమే సీఎం జగన్ లక్ష్యం

- చంద్రబాబుది మోసాల బాట
- జగనన్న సురక్షలో మంత్రి వేణు


లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: గతంలో చంద్రబాబు నాయుడు రైతులకు, డ్వాక్రా మహిళలకు, నిరుద్యోగులకు అనేక వాగ్దానాలు చేసి, అధికారంలోకి వచ్చాక మోసగించారని.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రం అన్ని వర్గాలకూ మేలు చేసి చూపించారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. వెలంపాలెంలో సర్పంచ్, ఏపీఈడబ్ల్యూడీసీ డైరెక్టర్ టేకుమూడి సుజాత అధ్యక్షతన గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశం యావత్తూ మన రాష్ట్రం వైపు చూసేలా సీఎం జగన్ పాలన సాగుతోందని అన్నారు. నోరు తెరచి అడగలేని వారికి కూడా ప్రభుత్వ సంక్షేమం అందాలన్న ముఖ్యమంత్రి ఆశయం మేరకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ నాలుగేళ్లలో వెలంపాలెంలో అర్హులైన 9,017 మంది లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.37.88 కోట్లు అందాయని వివరించారు. అభివృద్ధి పనుల నిమిత్తం రూ.1,98,31,000 ఖర్చు చేశామని తెలిపారు. ఇంత పెద్ద ఎత్తున సంక్షేమం, అభివృద్ధి అందిస్తున్న సీఎం జగన్ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని గ్రామస్తులకు మంత్రి వేణు విజ్ఞప్తి చేశారు. అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మంజూరైన 460 ధ్రువీకరణ పత్రాలను సర్పంచ్ సుజాత, ఉప సర్పంచ్ సొంగా లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు తుమ్మూరి సుబ్బలక్ష్మి, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ పలివెల నాగరాజు తదితరులతో కలసి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ, సర్పంచ్‌లు కొత్తపల్లి అరుణ, యల్లమిల్లి సతీష్‌కుమారి, నక్కిన దొరబాబు, ఎంపీటీసీ సభ్యులు బళ్ల సుధాకరరావు, రెడ్నం సతీష్, తహసీల్దార్ పి.తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు

రాయవరం: సమాజంలోని ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తీసుకుని వచ్చారని వైఎస్సార్‌సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ పేర్కొన్నారు. మండలంలోని సోమేశ్వరం, మాచవరం సచివాలయాల పరిధిలో గురువారం జగనన్న సురక్ష గ్రామ సభలను ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఆరిఫ్, కత్తుల సీతామహాలక్ష్మిల ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ సభల్లో పృథ్వీరాజ్‌తో పాటుగా మండపేట ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణలు మాట్లాడుతూ అర్హులను గుర్తించి ప్రభుత్వ పథకాలు అందించడంతో పాటుగా, సచివాలయాల పరిధిలో 11 రకాల సేవలను ప్రజలకు ఉచితంగా అందిస్తున్నట్టు వారు తెలిపారు. జగనన్నను మరోసారి సీఎం చేసేందుకు ప్రజలంతా అండగా ఉండాలని వారు కోరారు. అనంతరం అర్హులైన వారందరికీ సర్టిఫికెట్లను అందజేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి, ఉప సర్పంచ్ శాకా ఆదినారాయణ, పడాల వసంత్‌కుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కొవ్వూరి అమ్మిరెడ్డి ఎంపీటీసీలు కాళ్ల అప్పారావు, పలివెల శోభన, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, దేవస్థానం చైర్మన్ గరగ వెంకటేశ్వరరావు, సచివాలయ మండల కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

ప్రజారంజకంగా పాలన

మండపేట: కులమతవర్గాలు, రాజకీయాలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజకంగా పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు అన్నారు. వెలగతోడు సచివాలయం–2 వద్ద గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాల లబ్ధిని చేకూర్చేందుకు అమలుచేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం లబ్ధిదారులకు వెంకన్నబాబు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సాదే పిడుగురాముడు సర్టిఫికెట్లు అందజేశారు. మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ సుభాన్, బల్ల నాగేశ్వరరావు, సచివాలయం కన్వీనర్ ముక్కపాటి కోటేశ్వరరావు, పార్టీ నాయకులు అన్నందేవుల నాగేశ్వరరావు, ఎ.కిశోర్, టి.ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.


లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న వెంకన్నబాబు

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ లబ్ధి

కపిలేశ్వరపురం: అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధి చేకూరుతుందని ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు అన్నారు. తాతపూడిలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష గ్రామసభలో ప్రజాప్రతినిధులు మాట్లాడారు. తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీటీసీ సభ్యురాలు జుత్తుక వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు గూటం సత్యనారాయణలతో కలిసి లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. సచివాలయ కార్యదర్శి పలివెల మోహన్, సచివాలయ కన్వీనర్లు కొప్పిశెట్టి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు ఉప సర్పంచ్ గుత్తుల సురేష్, వాసంశెట్టి సాయిబాబు, ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.


సోమేశ్వరంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ యువనేత పృథ్వీరాజ్

చురుగ్గా ఫ్రంట్ ఆఫీస్ నిర్మాణం


ఫ్రంట్ ఆఫీస్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ ఆశీర్వాదం తదితరులు

మండపేట: ఏడిద పంచాయతీలో ఫ్రంట్ ఆఫీస్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రెండు నెలల్లో పనులు పూర్తి చేయడం ద్వారా భవనాన్ని త్వరితగతిన వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్టు సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలకు గాను పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్పంచ్ ఆశీర్వాదం, గ్రామ కార్యదర్శి వుండమట్ల వీర్రాజు కేరళలో కేంద్ర ప్రభుత్వం నుంచి దీనదయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ సశక్తీకరణ్ పురస్కారాన్ని అందుకున్న విషయం విదితమే. అవార్డుతో పాటు రూ.15 లక్షల నగదు ప్రోత్సాహాన్ని పంచాయతీకి మంజూరు చేసింది. ప్రస్తుతం ఉన్న పంచాయతీ భవనం ఇరుకుగా ఉండడంతో ఈ నిధులతో ఫ్రంట్ ఆఫీస్ పేరిట పంచాయతీ ఆవరణలో అదనపు భవన నిర్మాణానికి పంచాయతీ పాలకవర్గం నిర్ణయించింది. ఇటీవల ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు భూమి పూజ చేయగా నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించారు. ఈ పనులను సర్పంచ్ ఆశీర్వాదం గురువారం పరిశీలించారు. పౌర సేవలన్నీ ఫ్రంట్ ఆఫీస్‌లో అందించే విధంగా కార్యాచరణ చేస్తున్నామన్నారు.

మాజీ సర్పంచ్ తోట కాశీ మృతి


తోట కాశీ (ఫైల్)

కె.గంగవరం: సత్యవాడ గ్రామ మాజీ సర్పంచ్ తోట ఈశ్వర నాగ కృష్ణ రాజా సర్వారాయుడు (తోట కాశీ) (52) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఆయనకు భార్య లక్ష్మీకాంతి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. 2001 నుంచి 2007 వరకూ సర్పంచ్‌గా, అనంతరం నీటిసంఘం అధ్యక్షుడిగా సేవలు అందించారు. గ్రామంలో అందరికీ తలలో నాలుకలా ఉంటూ, శుభకార్యాల్లో, ఆపద సమయంలో ఆర్థిక సాయం చేస్తూ ఉండే కాశీ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

వ్యాసరచనలో విద్యార్థుల ప్రతిభ

మండపేట: రక్తదానంపై రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి బహుమతులు గెలుచుకున్నారు. బీఏ ఫస్ట్ ఇయర్‌కు చెందిన పిల్లి రాధిక, కోరుకొండ శాంతి, మహ్మద్ ఖారిర్ ముల్లా వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించినట్టు ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినులను అభినందించారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ కె.సత్యనారాయణ, సెక్రటరీ డాక్టర్ పీఎస్ శర్మ, లైఫ్ మెంబర్ ఒ.బాలరాజు, వైస్ ప్రిన్సిపాల్ ఎ.ఆనందరావు, లైబ్రేరియన్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


గడప గడపకూ మన ప్రభుత్వంలో మహిళకు సంక్షేమాన్ని వివరిస్తున్న మంత్రి వేణు


మాచర గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట

- మంత్రి చెల్లుబోయిన వేణు
- నెలపర్తిపాడులో గడప గడపకూ..

రామచంద్రపురం రూరల్: కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. నెలపర్తిపాడులో సర్పంచ్ రాయుడు సీతామహాలక్ష్మి ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి, ఆ కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఈ నాలుగేళ్లలో అందించిన సంక్షేమాన్ని వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కారానికి అధికారులను ఆదేశిస్తూ మంత్రి చెల్లుబోయిన వేణు ముందుకు సాగారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కపిలేశ్వరపురం: రైతు సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మాచరలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, సర్పంచ్ వాసంశెట్టి సునీత, పీఏసీఎస్ చైర్మన్లు కరెడ్ల చంటిబాబు, మేడిశెట్టి గోవింద్, వైఎస్సార్ సీపీ నాయకులు శీలం గోవింద్, వాసంశెట్టి విష్ణు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, సచివాలయ ఉద్యోగులతో కలిసి గ్రామంలో పర్యటించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా ఏసమయంలోనైనా తనను సంప్రదించవచ్చన్నారు. పేదల ప్రయోజనాలే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామంతోపాటు సమీప గ్రామాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణకు దిశ యాప్

దిశ విభాగం డీఎస్పీ మురళీమోహన్


దిశయాప్‌పై విద్యార్థినులకు వివరిస్తున్న డీఎస్పీ మురళీమోహన్

మండపేట: మహిళల రక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తూ దిశ యాప్‌ను తీసుకువచ్చిందని, మహిళలు తప్పనిసరిగా తమ సెల్‌ఫోన్‌లో ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా దిశ విభాగం డీఎస్పీ సుంకర మురళీమోహన్ అన్నారు. ఎస్పీ శ్రీధర్ ఆదేశాలు మేరకు గురువారం మండలంలోని ద్వారపూడి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు దిశ యాప్ గురించి పోలీసులు అవగాహన కల్పించారు. రూరల్ ఎస్ఐ బి.శివకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి డీఎస్పీ మురళీమోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిశ యాప్ మహిళలకు రక్షణ కవచంలా పనిచేస్తుందన్నారు. యువతులు, విద్యార్థినులు, మహిళలు ఆపద సమయంలో ఈ యాప్‌ను ఉపయోగించాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, చైల్డ్ ఫోర్నోగ్రఫీ, ఈవ్ టీజింగ్, మహిళా చట్టాలు గురించి విద్యార్థినిలకు వివరించారు. గ్రామ ఉప సర్పంచ్ తులా శేషారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావు, హెచ్ఎం రామయ్య పాల్గొన్నారు.